క్లుప్తంగా

దసరా వేడుకలకు ఘాట్లు శుభ్రం



పటమట(విజయవాడ తూర్పు): ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న దసరా శరన్నవరాత్రులకు కృష్ణానది తీరాన ఉన్న ఘాట్లను వీఎంసీ అధికారులు శుభ్రం చేస్తున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగరంలోని పున్నమి ఘాట్, పద్మావతి ఘాట్, కృష్ణవేణి ఘాట్, భవానీ ఘాట్‌లలో పారిశుద్ధ్య పనులను గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా సీఎంవోహెచ్ డాక్టర్ అర్జునరావు మాట్లాడుతూ.. దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఘాట్ల వద్ద పారిశుద్ధ్య నిర్వహణ చేస్తున్నామని, రోజూ ఘాట్లను పరిశుభ్రంగా ఉంచేలా క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామని అన్నారు.

'వేగా' ఆషాడం లక్కీడిప్ విజేతల ఎంపిక



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆషాడ మాసం సందర్భంగా వేగా జువెలర్స్ షోరూమ్‌లో నిర్వహించిన లక్కీడిప్ విజేతలను గురువారం ఎంపిక చేశారు. ప్రత్యేక సందర్భాలను పురస్కరించుకుని వేగా జ్యూవెలర్స్ అనేక ఆఫర్లను అందించడమే కాక, ఆ సమయంలో ఆభరణాలు కొనుగోలు చేసిన వారికి లక్కీ కూపన్లు అందించారు. ఆ కూపన్లు డ్రా తీసి విజేతలను ప్రకటించారు. విజేతలుగా ఎంపికైన నసీమబేగం అనిశెట్టి(నరసరావుపేట), కొల్ల బాలకృష్ణ(విజయవాడ), విజయకుమారి బెల్లంకొండ(విజయవాడ), లక్ష్మీ తిరువీధుల(విజయవాడ), హరిబాబు నల్లాని (గుంటుపల్లి)లకు చెందిన వారికి ఒక్కొక్కరికీ రూ.2 లక్షలు విలువ చేసే బంగారు/డైమండ్ నెక్లెస్‌లను బహుమతిగా అందచేసినట్లు వేగా జువెలర్స్ సంస్థ ఛైర్మన్ బండ్లమూడి రామ్మోహన్, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ వనమాలు తెలిపారు.

దసరా ఏర్పాట్ల పరిశీలన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవ ఏర్పాట్లను పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి గురువారం పరిశీలించారు. తొలుత ఇంద్రకీలాద్రిపై ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్లతో పాటు ఘాట్ రోడ్డులోని క్యూలైన్లు, కామధేను అమ్మవారి ఆలయం వద్ద పనులు, చైనావాల్, రథం సెంటర్ వద్ద పనులను పరిశీలించారు. పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఈవో శీనానాయక్‌కు సూచించారు. ఎమ్మెల్యే వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

గొల్లపూడి ఎగ్జిబిషన్‌కు భూమి పూజ



భవానీపురం(విజయవాడపశ్చిమ): సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో నిర్వహించనున్న విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా గొల్లపూడిలో ఏర్పాటు చేయనున్న ఎగ్జిబిషన్‌కు గురువారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. నగరంలో వినోదం కోసం యంగ్ జనరేషన్‌తో పాటు చిన్నారులు సైతం ఎదురు చూస్తున్న తరుణంలో దాదాపు 12 ఏళ్ల తరువాత విజయవాడలో ఎగ్జిబిషన్ మొదలు కానుండడం శుభపరిణామమని వారు పేర్కొన్నారు. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్(చిన్ని) చొరవతో ప్రారంభం కానున్న ఎగ్జిబిషన్ అమ్మవారి ఆశీస్సులతో విజయవంతం కావాలని నాయకులు కాంక్షించారు.

నేడు బోయి భీమన్న జయంతి ఉత్సవాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు విజయవాడలోని జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మహాకవి పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న జయంతిని నిర్వహించనున్నారు. కార్యక్రమానికి పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్, డాక్టర్ బోయి భీమన్న సతీమణి హైమావతి, ఎమ్మెల్యేలు, కలెక్టర్ లక్ష్మీశ హాజరుకానున్నట్లు రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆర్.మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు.

దసరా ఉత్సవాల్లో అడ్డగోలు అంచనాలు

- 25 శాతం లెస్‌తో ఖరారు చేసిన పలు టెండర్లు
- నాణ్యతలో రాజీ పడుతున్నారా.. లేక చేతివాటమా!
- సింహాచలం ఘటన తరువాత సైతం జాగ్రత్తలు తీసుకోకపోవడంపై ఆగ్రహం



వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): రాష్ట్రంలో రెండో అతి పెద్ద ఆలయమైన శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాల ఏర్పాట్ల నాణ్యతపై అధికారులు రాజీ పడుతున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. దసరా ఉత్సవాలు జరిగే 11 రోజులూ లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివస్తుంటారు. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగా ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. టెండర్లకు సంబంధించి అధికారులు తీసుకున్న నిర్ణయాలు పలు అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ఈ ఏర్పాట్లలో గందరగోళంగా వ్యవహరిస్తున్నారంటూ పలువురు విమర్శిస్తున్నారు.

> **సింహాచలం ఘటనతో భయపడుతున్న పరిస్థితి..**
>
> సింహాచలం కొండపై ఇటీవల వర్షానికి గోడ కూలి పలువురు మృతి చెందిన సంఘటన విధితమే. అక్కడ అధికారులు నిర్మాణంలో రాజీపడడం.. కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకొచ్చి పనులు చేయించడం జరిగిందనే విషయాలు నివేదికల్లో స్పష్టమయ్యాయి. అయితే అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ విజయవాడ కనకదుర్గమ్మ దసరా ఉత్సవాల్లో ఈ విధమైన నిర్ణయాలు, టెండర్లలో గందరగోళం భక్తులను అయోమయానికి గురి చేయడమే కాకుండా భయభ్రాంతులకు లోను చేస్తున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

అంచనా రూ.4.86 కోట్లు..
ఖరారు చేసింది రూ.2.54 కోట్లు

దసరా ఉత్సవాల ఇంజనీరింగ్ పనులకు సంబంధించి అధికారులు రూ.4,86,60,000లతో 11 పనులకు అంచనాలను రూపొందించారు. వాటికి టెండర్లను ఆహ్వానించి రూ.2,54,81,597లకు ఖరారు చేసినట్లుగా తెలిసింది. వీటిపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా స్నానఘాట్ల వద్ద ఫ్లోరింగ్ చదును చేయడానికి రూ.20 లక్షల అంచనాలతో పనులను రూపొందించారు. దానిపై 25.21 శాతం లెస్‌తో నగరానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తికి రూ.12.28 లక్షలకు ఖరారు చేశారు. అలానే హంసవాహనం మరమ్మతులు, విద్యుద్దీకరణ పనులకు రూ.11.70 లక్షలతో అంచనాలను రూపొందించి, 23.99 శాతం లెస్‌తో రూ.7.30 లక్షలకు ఖరారు చేశారు. కొండ దిగువున తాత్కాలిక క్యూలైన్ల ఏర్పాటుకు రూ.39 లక్షలతో అంచనాలను రూపొందించారు. 15 శాతం లెస్‌తో రూ.27.76 లక్షలకు విజయవాడకు చెందిన గొరిపర్తి భాస్కర్‌సాయి ఈ టెండర్‌ను దక్కించుకున్నారు. ఇలా 11 టెండర్లకు సంబంధించి 8 అంశాల్లో 18 నుంచి 25.20 వరకూ లెస్‌తో ఆయా టెండర్లను ఖరారు చేశారు.

చేతివాటం ప్రదర్శించారా..?

దసరా ఉత్సవాలకు సంబంధించి అధికారులు ఈ టెండర్ల విషయాల్లో తీసుకున్న నిర్ణయాలపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారుగా రూ.4.86 కోట్ల రూపాయాలతో వివిధ పనులకు అంచనాలు వేసిన అధికారులు రూ.2.54 కోట్లకు ఖరారు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. దాదాపు రూ.2.31 కోట్ల తగ్గింపుతో ఖరారు చేశారు. అమ్మవారి సొమ్మును జాగ్రత్త చేయడం మంచిదే అయినా అంత అధికంగా ఎందుకు అంచనాలను రూపొందించారనే విషయాన్ని స్పష్టం చేయాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు చేతివాటం ప్రదర్శించడానికి ఈ విధమైన ఎత్తుగడ వేశారా... అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యతపై అనుమానాలు..

అంచనా వ్యయాల కన్నా చాలా తక్కువగా నిధులు ఖర్చు చేయడంలో నాణ్యతా ప్రమాణాలు సైతం దెబ్బతింటాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అమ్మవారి దసరా ఉత్సవాలకు సుమారుగా 15 లక్షల మంది భక్తులు తరలివస్తారని అధికారులు అంచనా వేశారు. రోజూ లక్షకు తగ్గకుండా, మూలా నక్షత్రం రోజున 2 నుంచి 3 లక్షల మంది అమ్మవారిని దర్శించుకుంటారని అధికార యంత్రాంగం చెబుతుంది. ఇంత పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే ఉత్సవాల ఏర్పాట్లలో నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడి ముందుకు అడుగులు వేస్తే పెద్ద మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఐక్యతా భావంతో ఉత్సవాలను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

- శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు
- ఈసారి దసరా ఉత్సవాలకు 15 లక్షల మంది వస్తారని అంచనా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పండుగలు, పర్వదినాలు మతసామరస్యానికి ప్రతీకలని, ఐక్యత, సోదరభావంతో దసరా ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా శాంతి, సౌభ్రాతృత్వంతో ప్రతి పండగనూ జరుపుకొంటున్నామని, ఇదే స్ఫూర్తితో దసరా ఉత్సవాల విజయవంతానికి చేయిచేయి కలుపుదామన్నారు. ఈసారి దసరా ఉత్సవాలకు 15 లక్షల మందికి పైగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చేందుకు అవకాశముందన్నారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ భక్తులకు విజయవాడ పర్యటన మధురానుభూతులను మిగిల్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తిచేసే వారిపై పటిష్ట నిఘా ఉంటుందని, శాంతియుత వాతావరణానికి భంగం కలిగించాలని యత్నించే వారిపై డేగ కన్ను ఉంటుందని పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల భద్రత, పార్కింగ్ సదుపాయాలు, సీసీటీవీలు, డ్రోన్లతో నిఘా... ఇలా ప్రతి విషయంలోనూ ప్రత్యేక జాగ్రత్తలతో చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. సమావేశంలో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, డీసీపీ కేజీవీ సరిత, ఎండోమెంట్ ఏసీ ఎన్.షణ్ముగం, డీఎండబ్ల్యూ అబ్దుల్ రబ్బానీ, వివిధ మతాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా సాంస్కృతిక ఉత్సవాలు



వేడుకల్లో బోనాలతో మహిళల కోలాటం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మన సంస్కృతి, సాంప్రదాయాల విలువను నేటి తరం యువత తెలుసుకోవాలని ఇండియన్ లయన్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ తెలిపారు. మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం, సేఫ్, తరుణీ తరంగాలు, భారత మహిళా మండలి, జనశిక్షణ సంస్థాన్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్, సృహాష్టి ఆర్గనైజేషన్ మొదలైన స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో దసరా సాంస్కృతిక ఉత్సవాలను సిద్దార్థ ఆడిటోరియంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రచయిత్రి వి.సత్యవతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో ఉండే సృజనాత్మక శక్తులను వెలికితీసేందుకు ఇటువంటి వేదికలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో దసరా సాంస్కృతిక ఉత్సవాల కమిటీ కన్వీనర్ కె.స్వరూపారాణి, సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నగరంలోని పలు కళాశాలకు చెందిన విద్యార్థులు, మహిళల పోటీలు వేడుకగా సాగాయి.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): గద్దె వెంకట్రామయ్యనగర్ భక్తబృందం ఆధ్వర్యంలో 30వ డివిజన్ జీవీఆర్‌నగర్‌లో ఈనెల 22వ తేదీ నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు భక్తబృందం సభ్యులు గద్దె శ్రీను తెలిపారు. జీవీఆర్‌నగర్‌లో శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను భక్తబృందం సభ్యులు గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ప్రతి ఏటా భక్తులు, దాతల సహకారంతో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. 22వ తేదీ నుంచి ప్రతీరోజూ అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేస్తామన్నారు. 25వ తేదీ శుక్రవారం అమ్మవారికి శ్రీమహాలక్ష్మీ అలంకారం చేసి సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తామన్నారు. . వచ్చేనెల 5వ తేదీ ఆదివారం సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి పురవీధులలో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 12వ తేదీ ఆదివారం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని వివరించారు. నవరాత్రి ఉత్సవాల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో భక్తబృందం సభ్యులు నూతక్కి శ్రీను, కొండా మహాలక్ష్మయ్య, సీహెచ్ సుబ్బారెడ్డి, అర్జా నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు

ఆయుర్వేద ఔషధాలపై విద్యార్థులకు అవగాహన

లబ్బీపేట(విజయవాడతూర్పు): సహజ సిద్ధంగా తయారయ్యే ఆయుర్వేద ఔషధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పదవ జాతీయ ఆయుర్వేద దినోత్సవంలో భాగంగా డాక్టర్ ఎన్.ఆర్.ఎస్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో గురువారం స్కూల్ అవుట్ రీచ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాపీఠ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు కళాశాలలో ఏర్పాటు చేసిన హెర్బల్ ఎక్స్‌పో, ఔషధ తయారీ స్టాల్స్, ఇతర ప్రదర్శనలను సందర్శించి ఆయుర్వేదం వైవిధ్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మల జ్యోతిభాయి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ టి.బుల్లయ్య, ప్రొఫెసర్‌లు డాక్టర్ మధుసూదన్, డాక్టర్ శ్రీహరి, డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో నిందితుడికి శిక్ష, జరిమానా

పటమట(విజయవాడతూర్పు): కంపెనీకు కట్టాల్సిన సొమ్మును వ్యక్తి గతంగా వాడుకున్నందుకు నమోదైన కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ నాలుగో అడిషనల్ చీఫ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు యు.రామమోహన్ గురువారం తీర్పు ఇచ్చారు. వారి వివరాలు ఇలా.. పెనమలూరు మండలం, పోరంకి గ్రామానికి చెందిన మల్లెపూడి గోపి(34) పటమట పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో సేల్స్ టీమ్ లీడర్‌గా పనిచేసేవాడు. ఈ క్రమంలో 2016 జూలై నెల నుంచి కంపెనీ ప్రొడక్ట్‌ల సొమ్మును తన జల్సాలకు వాడుకునేవాడు. దీనిపై కేసు నమోదు కాగా నిందితుడిని పోలీసుల అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. విచారణ అనంతరం గురువారం కోర్టు నేరం రుజువైనందున శిక్ష విధించింది. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.పద్మ సమీర, సి.ఎం.ఎస్. ఇన్‌స్పెక్టర్ శ్రీ జగదీశ్వరరావు, పటమట ఇన్‌స్పెక్టర్ పవన్ కిశోర్ పర్యవేక్షణలో 11 మంది సాక్షులను కోర్టులో విచారించారు.

ఘనంగా ప్రపంచ వెదురు దినోత్సవం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వెదురుతో చేసిన కళాఖండాలు ఎంతో అద్భుతంగా ఉంటాయని 51, 53 డివిజన్ల కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, మహదేవ్ అప్పాజీరావు అన్నారు. ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా గణపతిరావు రోడ్డులో ఆంధ్రప్రదేశ్ మేదరి (మహేంద్ర) సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు గ్రంధి మహేష్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. మేదర కుల గురువు కేతేశ్వర స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు రాజేష్, అప్పాజీ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు కలెక్టర్ల సమావేశంలో మేదర్లకు సబ్సిడీతో వెదురు బొంగులను ఇచ్చే విధంగా కృషి చేయాలని ఆదేశించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు పల్లెపోగు ప్రసాదు, నవిరి మహేష్, సూర్య కల్యాణం ఉమామహేశ్వరరావు, మేదర సంఘ నాయకులు మొగ్గ శీను, పిల్లి మహేష్, గ్రంధి నాగేశ్వరావు, కోలా దాస్, ఆరి కుమార్, మొగ్గ అప్పలరాజు, దమ్ము అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణానికి ఎన్ని తిప్పలో!



100 అడుగుల రోడ్డులో రహదారి సగానికి పెట్టిన బోర్డులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): కార్మికవాడలో రహదారులపై ప్రయాణం చేయాలంటే ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. సన్‌లైట్ సెంటరులో 100 అడుగుల రహదారి మధ్యలో రావిచెట్టు ఉంది. ఈ చెట్టు ఉండటం కారణంగా తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. వివిధ షాపుల వారు స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని.. కొన్నేళ్లగా ఇదే తంతు అని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల గుంటతిప్ప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సిల్ట్ తీశారు. ఆ మట్టి అంతా రోడ్డు పక్కనే వేశారు. ఈ సిల్ట్‌ను తీయకపోవడంతో రాకపోకలు సాగించే వాహన దారులు నానా అవస్థలు పడుతున్నారు. 100 అడుగుల రోడ్డులో మరో చోట రోడ్డుకు సగానికి పైగా బోర్డులు పెడుతున్నారని.. దీని వల్ల వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

ప్రజాధనాన్ని దండుకునేందుకు చిల్లర రాజకీయాలు

నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడలో నిర్వహించే దసరా ఉత్సవాల్లో నేడు భక్తి ముసుగులో కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని దండుకోవాలనే దురాశతో చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రజా సంక్షేమంపై ఏ మాత్రం అవగాహన లేని కేశినేని చిన్ని వ్యాపార దృక్పథంతో ముందుకు వెళ్తున్నారన్నారు. ఇటీవల గొల్లపూడిలో వెలుగులోకి వచ్చిన స్థల వివాదం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం అని అన్నారు. జేబులు నింపుకొనేందుకే అమ్మవారి ఉత్సవాలను పక్కన పెట్టి 'విజయవాడ ఉత్సవ్' ప్రచారం చేస్తున్న విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. తమ నాయకులు పేర్ని నాని, దేవినేని అవినాష్‌లు మాట్లాడక పోతే గొల్లపూడి భూమిని కబ్జా చేసేవారని విమర్శించారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ మాట్లాడుతూ.. రెండు రోజులుగా పేర్ని నాని, దేవినేని అవినాష్‌లు కూటమి ప్రభుత్వం చేస్తున్న కబ్జాలపై పోరాడుతున్నారని వివరించారు. మరో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజా రెడ్డి మాట్లాడుతూ.. 15 నెలల కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి శూన్యమని ఆరోపించారు.

సచివాలయాల్లోనూ ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి



రాఘవయ్యపార్కు వద్ద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): స్వచ్ఛోత్సవ, స్వచ్ఛత ఈ సేవ–2025లో భాగంగా, ప్రతి సచివాలయంలో ఆర్ఆర్ఆర్(రీయూస్, రీసైకిల్, రెడ్యూస్) కేంద్రం ఏర్పాటు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఆయన రాఘవయ్య పార్క్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటికే 64 వార్డుల్లో 64, 9 ప్రత్యేకమైన ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఉన్నాయని, ప్రస్తుతం ప్రతి సచివాలయంలో కూడా ఒక ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజలు ఆర్ఆర్ఆర్ కేంద్రం వద్దకు వచ్చి, వారికి అవసరం లేని స్టీల్ పాత్రలు, వస్త్రాలు పుస్తకాలు, కాగితాలు, చెప్పులు, షూ, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతరత్రా సామాగ్రిని ఈ కేంద్రాలలో అందించవచ్చని, వాటి ద్వారా వ్యర్థాలను తగ్గించడం, పునర్వినియోగించడం చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయిన్ వ్యర్థాలు నిరంతరం తొలగించాలి



అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో నిరంతరం డీసిల్టింగ్ పనులు జరగాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన వన్‌టౌన్ తారాపేట, బీఆర్పీ రోడ్, నెహ్రూ రోడ్, పాడి వీధి ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఔట్ ఫాల్ డ్రెయిన్‌లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో పని చేస్తూ వ్యర్థాల తొలగింపు.. డీసిల్టింగ్ పనులు చేపట్టాలన్నారు. మెషిన్లను వ్యర్థాలు తొలగించే ప్రక్రియలో పూర్తిస్థాయిలో ఉపయోగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వన్‌టౌన్ గాంధీ మహిళా కళాశాల వద్ద గల అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు.

నేటి నుంచి నూతన భవనంలో అన్నదానం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో శుక్రవారం నుంచి నూతన అన్నదాన భవనంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరగనుంది. మహా మండపం ఎదుట దేవస్థానం నూతన అన్నదాన భవనం, గోశాల వద్ద లడ్డూ పోటులను సిద్ధం చేసింది. గత శుక్రవారం ఆయా భవనాల్లో దేవస్థాన అధికారులు పాలు పొంగించగా, నేటి శుక్రవారం నుంచి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం వరకు భక్తులు అన్నదానం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు అన్నదానం జరిగే భవనంతో పాటు లడ్డూ పోటును ఈవో శీనానాయక్ గురువారం తనిఖీ చేశారు. అన్నదాన భవనంలో భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ, తాగునీటి సదుపాయాల గురించి పెనుగంచిప్రోలు ఈఈ ఎల్.రమా ఈవోకు వివరించారు. లడ్డూ పోటులో జరుగుతున్న పనులను ద్వారకా తిరుమల ఈఈ భాస్కర్ ఈవోకు వివరించారు. ఈవో వెంట దుర్గగుడి ఏఈవో శ్రీనివాస్, వెంకటరెడ్డిలు ఉన్నారు.

ఉత్సవాలకు సిద్ధంగా 2 లక్షల వాటర్ బాటిల్స్..

దసరా ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు పంపిణీ చేసేందుకు గానూ దేవస్థానం 2 లక్షల వాటర్ బాటిల్స్‌ను సిద్ధం చేసింది. దేవస్థానానికి చేరిన వాటర్ బాటిల్స్ నాణ్యత, తయారీ తేదీ వంటి అంశాలను ఆలయ ఈఈ కోటేశ్వరరావు పరిశీలించారు.

కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మించాలి



స్థానిక మహిళలతో మాట్లాడుతున్న సత్యబాబు

వించిపేట(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మాణాలు చేపట్టి ప్రజల ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. గురువారం ఆయన 49వ డివిజన్‌లోని కొండ ప్రాంతంలో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు 49వ డివిజన్ కొండ ప్రాంతంలో రెండు వేర్వేరు చోట్ల రిటైనింగ్ వాల్స్ జారి కింది నివాసాల మీద పడడంతో ఆయా ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ముందస్తుగా ప్రభుత్వం స్పందించి ప్రమాదకర ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మాణాలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి జి.బాలదుర్గారావు, నాయకులు చిన్న గురవప్పా, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన భవానీపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. భవానీపురానికి చెందిన ఓ మహిళకు ఆరేళ్ల కిందట అబ్దుల్ హఫీజ్‌తో వివాహమైంది. ఇద్దరిదీ రెండో వివాహం. మహిళ మేనత్తతో హఫీజ్ వివాహేతర సంబంధం పెట్టుకోగా వద్దని భార్య నచ్చజెప్పింది. అతను వినలేదు. ఆమెతోనే ఉంటానని, కావాలంటే నీకు విడాకులు ఇస్తానంటూ భార్యను బెదిరించాడు. అదేవిధంగా రోజూ మద్యం సేవించి వేధింపులకు గురిచేస్తున్నాడు. భర్త వేధింపులు భరించలేని ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థలయజమానిని బెదిరించిన వ్యక్తిపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు చిట్టినగర్ కేటీ రోడ్డుకు చెందిన చుంచు నరసింహారావుకు విద్యాధరపురం లక్ష్మీనగర్‌లో ఖాళీ నివేశన స్థలం ఉంది. ఈనెల 16వ తేదీ తెల్లవారుజామున స్థలం ప్రహరీ గోడకు టీ రాజేష్‌నాయుడు పేరుతో బ్యానర్‌తో పాటు ఐరన్ కంటైనర్ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో చుంచు నరసింహారావు తన స్థలం వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్‌పై ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి కంటైనర్‌ను తొలగించాలని రాజేష్‌నాయుడును కోరగా, ఐరన్ కంటైనర్ తీసేది లేదని, దిక్కున్నచోట చెప్పుకో అంటూ బెదిరించాడు. దీంతో నరసింహారావు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.